కోమలి

వేముల శకుంతల

వరండాలో చివరగా ఓ చిన్న స్టూలుమీద కూర్చునివుంది ఆమె. భుజాలనిండుగా కొంగు బిగించుకున్నా మనసు నిండా కొండంత దిగులు – కళ్ళనిండా గుబులు నింపుకొని నిముషనిముషానికి, సన్నగా నిట్టూరుస్తూ – నుదుట పేర్కుంటున్న చిరుచెమటల్ని కొంగుతో తుడుచుకుంటోంది.

ఆ వీధిలో రోడ్డుకవతల సగం ఎండి కొమ్మలు నరికిన తుమ్మచెట్టుమీద–కొన్ని కాకులు అదేపనిగా అరుస్తున్నాయి. కొన్ని రెక్కలు విప్పుకుని టపటప కొట్టుకుంటుంటే మరికొన్ని కిందకీ పైకీ ఎగురుతూ శ్రుతి కలుపుతున్నాయి.

పావుగంట క్రితం– ఓ కాకి రెండుసార్లు అరిచింది. ఐదునిముషాల తరువాత మరో నాల్గు కాకులు– గబగబా వచ్చి టెలిగ్రాపు తీగమీద వాలేయి. సరిగ్గా

మరో ఐదారు నిమిషాల్లో- అరడజను కాకులు తుమ్మచెట్టు కొమ్మల్లో దూరి- గొంతు కలిపేయి!

ఇప్పుడవన్నీ మూకుమ్మడిగా గోల చేస్తున్నాయి! వాటన్నిటి చూపు - చెట్టు కిందవున్న చెత్తకుండీ పక్కన ఓ చచ్చి పడున్నట్టున్న 'పదార్థం'మీదే వుంది!

నిర్మానుష్యంగా- నిశబ్దంగా వున్న ఆ వీధిలో ఆ కాకుల గోల తప్ప మరేమీ వినిపించటం లేదు——

వరండాలోని ఆమె- తల తిప్పి అటు చూసింది. ఆమె కూర్చున్న వరండా నుంచి కొద్దిగా పక్కగావున్న ఆ తుమ్మ చెట్టుమీద కాకులు మరింతగా రెచ్చిపోతున్నాయి.

విసుగ్గా - భరించలేనట్టుగా కళ్ళు మూసుకుని మళ్ళీ తెరిచింది- అప్పుడు పావు తక్కువ రెండు కావస్తోంది సమయం!

సరిగ్గా అప్పుడే లోపల గుమ్మంలోనుంచి 'ఓ తల' బయటకి చూసి మళ్ళీ లోపలికి తప్పుకుంది. ఆ తల తాలూకు రెండుకళ్ళు ఆమెను సూటిగా చూసేయి!

ఆమె చిన్నగా నిశ్వసించుకుంది!

వాచీ చూసుకుంది- అప్పుడే తను వచ్చి అరగంట దాటింది. ఈ అరగంటలో తన అనుభవాన్ని గుర్తుచేసుకుంది.

బస్సు దిగి అడ్రసు చూసుకుంటూ రెండు మెయిన్‌బజార్లు నాలుగైదు చిన్న సందులూ దాటి ఈ వీధిలోకివచ్చి గేటు తీసుకుని లోపలికి వచ్చింది. లోపల్నుండి ఓ పెద్దమనిషి వరండాలోకి వచ్చి 'ఎవరు కావాలి?' అని అడిగేడు.

తను చెప్పింది- 'రఘుప్రసాద్‌గారు వుండేది ఇక్కడేనా? వారికోసం హైద్రాబాదు నుండి వచ్చాను-'

ఆ పెద్దమనిషి పైనుంచి కిందకి- కిందనుంచి పైకీ చూసి, కనుబొమ్మలు పైకి లేపి- 'ఓహో! అలాగా? వాడితో ఏమిటి పనీ?' అనడిగేడు.

తను వెంటనే చెప్పలేకపోయింది. అయినా రఘుతో తప్ప తనకి ఎవరితోటీ పరిచయం లేదు- కొత్త వ్యక్తులతో తన వ్యక్తిగత విషయం ఎలా చెప్పగలదు? సిగ్గుగా బిడియంగా అనిపించి- 'వారు లేరా?' అన్నది.

'ఏం? వాడితో కానీ చెప్పకూడదనా? నేను వాడి మేనమామని! ఫర్వాలేదు చెప్పవచ్చును.' అన్నాడా పెద్దమనిషి- ఆ మాటతీరులో వినిపించిన వ్యంగ్యం, హేళన- తనకి చురుక్ మంది. మనస్సు గాయపడింది. గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకుంది. కాని అతికష్టంమీద నిగ్రహించుకుని- తన అవసరాన్ని గుర్తుచేసుకుని- చిన్న నవ్వు నవ్వి- 'ఇంతకీ వారు ఇంట్లో లేరా? మీరు మేనమామ గారా! నమస్కారం!' రెండు చేతులు జోడించింది.

ప్రతినమస్కారం చెప్పలేదు సరికదా- విసురుగా ఇంట్లో కెళ్ళిపోయాడు!

ఏం చేయాలో తోచక- రెండు నిముషాలు తటస్థంగా నిలబడిపోయింది తను. అప్పుడు లోపల్నుంచి ఓ అమ్మాయి సరిగ్గా తన వయస్సుదే- అంటే ఇరవై- ఇరువై ఐదు సంవత్సరాల మధ్యలో వున్న అమ్మాయి బయటికి వచ్చింది.

'ఎవరండీ? ఎవరు కావాలి?'

'నేను హైద్రాబాదు నుంచి వచ్చానమ్మా! రఘుప్రసాదు వున్నారా? వారితో మాట్లాడాలి!'

'మా అన్నయ్యతో మీ కేం పనండీ?' అని నిలదీసింది.

'అంటే___రఘుగారి చెల్లెలా మీరు? నమస్కారం!'

'నమస్కారం! అవును రఘు మా అన్నయ్యే! హైద్రాబాదు నుంచి మా అన్నయ్యకోసం వచ్చారా? ఎందుకు? వాడెలా తెలుసు?' ఆ అమ్మాయి కళ్ళలో ఆశ్చర్యమో- అనుమానమో తెలియని భావం తొంగిచూసింది.

తను మళ్ళీ చిన్నగా నవ్వి- 'మీ అన్నయ్య మా ఆఫీసులోనే పనిచేసేవారు. మాకు బాగా ఫ్రెండ్! వారితో కొద్దిగా పనుండి వచ్చాను. ఇంట్లో లేరా!' అన్నది తను.

'అదే ఏం పనో చెప్పండి! వాడు వచ్చాక చెప్తాను. ఊళ్ళో లేడు___'

'అయ్యో ఊళ్ళోనే లేరా? ఏ ఊరు వెళ్ళేరు? ఎప్పుడు వస్తారు?' తను ఆ క్షణంలో హతాశురాలై పోయింది___

ఆ అమ్మాయి అదోలా చూసి 'ఇంట్లో అడిగి చెప్తాను' అంటు గిర్రున ఇంట్లోకెళ్ళిపోయింది- పది నిముషాల తర్వాత బయటికి వచ్చింది. అంతసేపు తను వరండా మెట్లమీదే నిలబడి పోయింది!

'మా అన్నయ్య ఈ రెండు గంటల ట్రైనులో వస్తాడు! మరి వుంటారా?'

'వుంటాను' అని తను అన్నాక 'అక్కడ కూర్చోండి' అంటూ ఇదిగో ఈ స్టూలు చూపించి లోపలికి వెళ్ళి పోయింది

తను- అదే మహాభాగ్యంగా భావించి కూర్చుండిపోయింది. మనసంతా చికాకుగా వుంది. బ్రతుకంతా శూన్యంగా కనిపిస్తోంది!!

తనకి ఉద్యోగం వుంది. తన కాళ్ళ మీద తను బ్రతకగల ధైర్యం వుంది. పరువుగా మర్యాదగా జీవించాలనే ఆకాంక్ష వుంది! ఎప్పటికీ తనలోని సంస్కారం, నిలబెట్టుకోవాలనే తపన వుంది. నీతికి నిజాయితీకి కట్టుబడి వుండాలన్న తలంపు వుంది! గొప్ప పనులేమీ చేయలేకపోయినా కనీసం మనిషి స్థాయి నుంచి దిగజారిపోకూడదన్న మంచి మనసు వుంది!

కానీ ఏం లాభం??

సమస్యల ముడిలో చిక్కుకుంది, తను! ఆ ముడి జాగ్రత్తగా విప్పుకోక పోతే- తను అగాధంలో పడిపోతుంది!

అందుకే ఆలస్యం చేయకుండా ఇలా రఘుని వెతుక్కుంటూ వచ్చింది! స్వయంగా రఘుతో మాట్లాడాలి కానీ— తనకి పరిచయంలేని అతని కుటుంబీకులతో ఏమని చెప్తుంది?—

అయినా వీళ్ళ ధోరణి చూస్తే—ఏమిటో బాధగా వుంది! తను ఇక్కడ కూర్చున్న ఈ అరగంటసేపట్లో— ఎదురుగా వచ్చి ఎవరూ పల్కరించలేదు సరికదా బయటికి వెళ్తూ ఒకసారి, లోపలికి పోతూ ఒకసారి— తలమాత్రం బయటికి పెట్టి ఒకసారి— చూస్తున్నారు. నోరువిడిచి మంచినీళ్ళు కావాలని తను అడిగేదాకా—కనీసపు మరాద్యకూడా చేయలేదు. గ్లాసుడు నీళ్ళు తాగేక 'పర్వాలేదు చల్లగానే వున్నాయి' అనుకుంది— అవి తాగి అప్పుడే— చాలా సేపైంది. మళ్ళీ దాహం వేస్తున్నా అడిగే ధైర్యంలేక గుటకలు మింగుతూ— రఘు కోసం ఎదురుచూస్తూ కూర్చుంది, ఆమె.

ఈ అరగంటనుంచి ఇంటిలోపల చాలా పార్పులు జరుగుతున్నాయి— ఆ ఇంటి పెద్దావిడైన రఘుతల్లి—కళ్ళనీళ్ళు కారుస్తూ— సన్నసన్నగా గొణుక్కుంటోంది—

'పెద్దకొడుకు, ఇంటిని ఆదుకోవల్సిన వాడు—ఇలా ఈని దాని తను చూసుకుంటే— మా గతేం కానూ? ఇలా నా వయస్సుచేతా దనుకోలేదు— నేను ఇప్పుడేం చేయనూ!'

'ఊరుకో అక్కయ్యా! అలా కొంప మునగనిస్తామేమిటి? రఘు వచ్చాక చూదాం!' అని ఓదారుస్తూ భుజంరాస్తోంది ఆవిడకి స్వయాన చెల్లెలైన మరొకావిడ.

'ఎంత బరితెగించింది కాకపోతే— ఇలా ఇంటికే వస్తుందా? నేను ఎన్నాళ్ళ నుంచో అనుకుంటూనే వున్నాను.ఎప్పుడు పెళ్ళిమాట ఎత్తినా— వీడు 'ఇప్పుడే వద్దు ఇప్పుడే వద్దు—' అని దాటేస్తుంటే— ఇలాంటిదేమైనా జరిగిందేమో అని అనుమానపడుతూనే వున్నాను. వెధవ ఆడపిల్లలు! మరీ పెట్రేగిపోతున్నారు! కట్టుబాట్లు లేకుండా— ఇలా మగపిల్లలమీద వల విసిరి— లోబరుచుకుంటున్నారు. ఇలాంటివాళ్ళు రేపు మరొకడితో వెళ్ళిపోరని నమ్మకమేమిటి? దాని తల్లి తండ్రులకి బుద్ధివుండొద్దూ? పెళ్ళి చేయలేకపోతే బ్రతుకుతెరువుకి ఉద్యోగం చేసుకుంటూనే వుందిగదా? అలా జీవితం గడుపుకోక— మంచిపిల్లాణ్ణి చూసి ఇలా మాయలో పడేస్తుందా? గుళ్ళో చేసుకున్నారో— రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారో?—

'అయినా ఒక మాట చెల్లెమ్మా!' అని మరింత రహస్యంగా— 'మన రఘుకి దాని మోజు తీరిపోయినట్టుందిలే— లేకపోతే ఇక్కడికి ట్రాన్స్‌ఫరై వచ్చాక ఈ నెల్లాళ్ళనుంచి పెళ్ళిమాట ఎత్తితే విసుక్కోవటం లేదు— అందుచేత ఏం భయపడక్కర్లేదు— దాన్ని వదిలించుకునే పద్ధతి నేను చెప్తా గదా? ఏడవకు

ఊరుకో!'- అంటూ అభయం ఇస్తున్నాడు, ఆవిడ అన్నయ్య!

ఒకవేళ అన్నయ్య- అవతల వున్న ఆ అమ్మాయిని- వదినగా స్వీకరిస్తే-తనకి కట్నం ఇచ్చి పెళ్ళి ఎలా చేయగలడూ? వాడు కట్నం తీసుకుని చేసుకుంటే కదా తనకి మళ్ళీ ఘనంగా కట్నంయిచ్చి పెళ్ళి చేయగల స్థోమత్తు వస్తుంది- లేకపోతే తనకి పెళ్ళెలా అవుతుంది? తనకి పెద్ద చదువు- ఉద్యోగం కూడా లేవు. ఇక తనకి పెళ్ళెప్పటికి అవుతుంది? అని రఘు చెల్లెలు దిగులుగా కూర్చుంది.__

మూల మంచంలో- ముక్కుతూనే రఘుబామ్మ-యథాశక్తి గొణుగుతోంది-

"ఏమిటో! నా కొడుకే బ్రతికివుంటే ఈ రఘుగాడు ఇలాంటి అప్రాచ్యపు పని చేస్తాడా? ఓక్కుమాలిన ప్రేమలు__ పెళ్ళిళ్ళు! కులం - మతం - అన్నీ భ్రష్టత్వం అయిపోతున్నాయి! దానిది ఏ వర్ణమో? ఏం పాడో? దాన్ని కొంపలో తెచ్చిపెడ్తే నేను బ్రతకలేనే కోడలా? ఈ ప్రాణం ఇంక నిలవదు__' అంటూ గుండెలమీద రాసుకుంది.

'నువ్వూరుకో బామ్మా! మామయ్య రానిస్తాడేమిటీ? ఎక్కువగా మాట్లాడకు ఆయాసం వస్తుంది. మందు అయిపోయింది కూడా! అన్నయ్యవచ్చి తెచ్చేదాక ఆగాల్సిందే!' అని టెన్తుక్లాసు చదువుతున్న రెండో మనమడు బామ్మని గదమాయించి__ తనను మందు తెమ్మని చెప్పకుండా ముందే హద్దులో వుంచేడు!

అరగంటసేపు ఇలా లోపలి గదిలో రహస్యంగా తిట్టుకోడాలు- విమర్శలు- తర్జనభర్జనలు నానా భంగిమల్లో జరిగిపోతున్నట్టు ఏమాత్రం తెలియని- బయటి వరండాలో ఆమె__ రఘు నిరీక్షణలో-తన సహనాన్ని పరీక్షించుకుంటూ చూపులన్నీ గేటుమీదే నిల్పివుంచింది

చెట్టుమీద కాకులు__ ఒకటే గోల చేస్తున్నాయి! చెవులు అదిరిపోతున్నా__ భరించుకుంటోంది ఆమె!

మరొక పావుగంట దాటిపోయి రెండైంది! సెకన్లు నిముషాలు గడిచిపోతున్నాయి! రఘు వచ్చేజాడ లేదు. ఆమెలో ఓపిక క్షీణించిపోతోంది__ లోపలివాళ్ళు బయటకి వస్తున్నారు. ఓరగా ఆమెను చూసీచూడనట్టు గేటు తీసుకుని బయటికి వెళ్ళి మళ్ళీ వస్తున్నారు-

కొద్దిసేపటి తర్వాత ఆమె లేచి వరండాలో అటు ఇటు తిరుగుతూ తల తిప్పి చూసింది. ఎదురింటి కిటికీలో రెండు తలలు నిక్కినిక్కి చూస్తున్నాయి! చప్పున తల తిప్పుకొని పక్కకి నడిచింది. పక్కింటి అరుగుమీద ... ఆ ఇంటి ఇల్లాలు, ఆమె భర్త కాళ్ళు పైకెత్తి చూస్తూ- కనిపించేరు- వెంటనే తల దించుకుని మళ్ళీ వచ్చి స్టూలు మీద కూర్చుంది ఆమె-

చెట్టుమీద__ టెలిగ్రాఫ్ తీగల మీద కాకులసంఖ్య పెరిగిపోయింది!! అరుపులు

మరీ కర్ణకఠోరంగా వుంది.

అప్పటికి సమయం రెండున్నర దాటింది।

ఆమెలో ధైర్యం- ఆశ సన్నగిల్లి పోయాయి। బహుశా రఘు ఈ రైలుకి రాడేమో అనుకుంది. పోనీ ఏ ఊరు వెళ్ళేడూ— ఏ పనిమీద వెళ్ళేడో అని అడుగుదామన్నా-ఇంటివాళ్ళెవరూ తనని లోపలికి పిలవటమే లేదు।

తనే తెగించి లోపలికి వెళ్తే?

అవును ఇంత దూరం వచ్చి బిడియ పడ్తే ఎలా?

అవసరం తనది। అనుకుని చటుక్కున లేచింది. వివరాలన్నీ అడిగి- తనను గురించి చెప్పి ఒకసారి హైద్రాబాదుకి రఘుని రమ్మని చెప్పాలి- అనుకుంటూ గుమ్మంవైపు అడుగువేసింది—

సరిగ్గా అప్పుడే- మరో రెండు కొత్తముఖాలు తలుపుదగ్గర నిలబడి. తనవైపు చూస్తూ సైగలు చేసుకుంటున్నాయి కళ్ళతో।

ఇంతవరకు బయటికీ-లోపలికీ తిరిగిన ముఖాల్లా లేవు అవి।

ఆమెకి ఎందుకో భయం వేసింది। వెంటనే వెనక్కి- తిరిగి చూసింది। ఎదురింటి కిటికీల్లో- పక్కింటి అరుగుమీద అందరు తననే చూస్తున్నారు।

ఒక్కసారి నిలువెల్లా సిగ్గుతో కుంచుకుపోయింది ఆమె। మనస్సంతా అవమానంతో నిండిపోయింది।

ఛీ। నే నెంత తొందరపడి వచ్చాను? కనీసం ఉత్తరం రాయాల్సింది। నా ఆవేదనలో ఆరాటంలో ఏదీ తోచలేదు।—

ఇంకా రఘుకి ఏదో చెప్పాలనుకోటం- పొరపాటు- వెంటనే వెళ్ళిపోవాలి। నాల్గు గంటల రైల్లో వెళ్ళిపోవాలి। ప్లాటుఫారం మీదే కూర్చోవచ్చును— అనుకుని— 'ఏమండీ నేను వెళ్తున్నాను. బహుశా రఘుగారు ఇవాళ రారేమోలెండి।' అని లోపలికి వినిపించేలా గట్టిగా అనేసి చరచరా మెట్లుదిగి గేటు తీసుకుని బయట పడింది।

బిలబిలలాడుతూ చీమల్లా ఇంట్లో వాళ్ళంతా వరండాలోకి వచ్చారు — వీధిలో అల్లంత దూరంలో కొంగు నిండా కప్పుకుని గబగబా వెళ్తున్న ఆమెను చూసి— 'మంచి పనే జరిగింది। వాడు రాలేదు।' అని ఒకరంటే- 'అబ్బో। పెద్ద పతివ్రత వేషం చూడు!' అని మరొకరు- 'ఆ। ఎన్ని వేషాలు లేకపోతే ఇంత ధైర్యం చేస్తుందని' ఇంకొకరు—

'ఎలా వచ్చిందో అలా వెళ్ళింది।' అని మేనమామ నవ్వేడు- 'పోనీలే మీ అక్కయ్య అదృష్టవంతురాలు। గొడవ జరగకుండా ఆ పిల్ల తనదారిని తను పోయింది।' అని పొగిడిందొకావిడ।

అప్పుడే అందరు గమనించినట్టు- 'ఇదేమిటీ? ఈ కాకులగోల విపరీతంగా వుందే।' అని విసుక్కున్నారు- వాళ్ళలో ఒకళ్ళు వెళ్ళి- వాటిని అదిలించేరు

యుః



అయినా అవి మానలేదు అరుపు-చింకుగా ఎక్కడివాళ్ళు అక్కడి కెళ్ళిపోయారు.

ఓ గంటన్నర తర్వాత- రఘు బ్యాగ్ ఊపుకుంటూ వచ్చాడు.

'అదేమిట్రా! ఇప్పుడు ఏ రైలుంది!' అని తెల్లబోతూ అడిగేడు మేనమామ!

'ఇప్పుడే రైలు లేదు. నేను రెండు గంటల రైల్లోనే వచ్చాను అన్నాడు రఘు- బ్యాగ్ బల్లమీద పెట్టి-

'మరి! లేటైందా!'

'కాదు. స్టేషన్ దగ్గర మా ఫ్రెండ్ ఒకడు కనిపించి మాటల్లో పెట్టేసేడు– అలస్యమైంది. ఇంతలో.... సావిత్రి కనిపించింది– మళ్ళీ ఆమెతో స్టేషన్ కెళ్ళేను–'

'సావిత్రా? అదెవ్వర్రా?' అంది తల్లి.

మంచంమీద కూర్చుని బూటు లేసులు విప్పుకుంటూ–

'మనింటికి వచ్చి– నా కోసం చూసి– తిరిగి వెళ్ళిపోయి నావిడ!' అన్నాడు తాపీగా!

'ఆఁ? అయితే అది నీకు కనిపించిం దన్నమాట?'

'ఆఁ కనిపించేరు మామయ్యా! అది గిది అనకు! పరువు మర్యాదా గల కుటుంబంలో మనిషి! రాకరాక మన వూరు వస్తే– సమయానికి ఇంట్లో నేను లేను. వెనక్కి రమ్మంటే నానని, తనకి చాలా అర్జెంటు పనివుందని నాల్గుగంటల రైలుకే వెళ్ళిపోతానన్నారు. కనీసం రైలు వచ్చేవరకు అక్కడే వుండి ఎక్కించి వచ్చాను– మీవాళ్ళు చాలా మంచివాళ్ళ అని చెప్పేరు– కాఫీ టిఫిను బాగా పెట్టేరు కాబోలు'– అన్నాడు నవ్వుతూ–

అంతా ముఖాలు చూసుకుని వెర్రి నవ్వు నవ్వి ఊరుకున్నారు. 'బామ్మా! ఎలా వున్నావు? మందు ఐపోయినట్టుంది తెస్తాలే సాయంత్రం! నేను వెళ్ళిన పని సక్సెస్ అయింది మామయ్యా! ఆఫీసర్ ఓ.కే. చేసేడు! త్వరగా ప్రమోషన్ రావచ్చును నాకు! ఇక పెళ్ళిప్రయత్నాలు మొదలెట్టండి!' అని బూట్లు మంచం కిందకి తోసి లేవబోయాడు–

'ఒరే రగ్గూ! ఇంతకీ ఆ సావిత్రి ఎవర్రా' అని చేయి పట్టుకుని ఆపింది బామ్మ.

'ఆవిడ మా ఆఫీసులో పనిచేసే వారు. ఇప్పుడూ అక్కడే వున్నారనుకో! పాపం! మంచి సంబంధం అని చెప్పి తల్లితండ్రులు పెళ్ళి చేసేరు. వాడూ మా ఆఫీసులో వాడే! కానీ వట్టి తిక్క– వెధవ! చచ్చే అనుమానం! డబ్బు కావాలి– కాని పెళ్ళాం మగాళ్ళ మధ్య కూర్చో కూడదు– మాట్లాడ కూడదు– ఎలాగ? ఉద్యోగంచేసే వీరు హద్దులు దాటకుండా వీలవుతుందా? పోనీ జాబు వదిలేస్తా నన్నారు. ఆవిడ! అబ్బే! వద్దన్నాడు– పైగా తాగివచ్చి నానా బాధ పెడ్తాడు– ఆవిడకి ఎంత వోర్పో? ఏదీ చెప్పరు– ఈ త్రాష్టుడే తాగిన మైకంలో వున్న ప్పుడు– తను చేసే ఘనకార్యాలన్నీ చెప్పేవాడు!

'ఇప్పుడు– వెధవ ఎవరో అమ్మాయిని పట్టేడు– బాగా డబ్బుందిట! అందుకని సావిత్రిని వదిలేయాలనుకుంటున్నాడు– పాపం ఆవిడ తల్లితండ్రులు ఈ మధ్యనే ఏక్సిడెంట్‌లో పోయేరు– అందుకని కష్ట సుఖాలన్నీ మా కొలీగ్స్‌కే చెప్పుకుం టుంది! నన్ను అన్నయ్యలా చూస్తుంది. 'డైవోర్స్ తీసుకోను నువ్వు వచ్చి

ఆయనతో చెప్పు' అని నాతో చెప్పడానికి ఈ ఊరు వచ్చేరుట! పోనీ వదిలేయ కూడదా వెధవని అని నేను చెప్తే- 'మా పాపకి తండ్రి కావాలి— నాకు భర్త అక్కర్లేకపోయినా!' అన్నారు. అన్నట్టు వాళ్ళకి రెండేళ్ళ పాప వుందిలెండి!— ఏమిటో పాపం- చాలా మంచావిడ— జాతకమే బాగులేదు- సరే ఒకసారి హైద్రాబాదు వెళ్ళిరావాలి నేను-' అంటూ లేచి- 'మరి మామయ్యా! నాకు ప్రమోషన్ ఖాయం! ఇన్నాళ్ళూ అందుకే పెళ్ళి వాయిదా వేసేను. ఇంక నా ఆలస్యం ఏం లేదు—' అనేసి సిగ్గుపడినట్టు నవ్వేడు రఘు

'శుభం! అలాగే. వెళ్ళి స్నానంచేయి!' అన్నాడు మామయ్య. రఘు బాతురూమ్‌లో స్నానం చేస్తున్నప్పుడు— వాళ్ళంతా అనుకున్నారు—

'పాపం! ఆ ఇల్లాలు ఆ భర్తతో ఎలా పడుతోందో? సావిత్రి పెరుకు తగిన మనిషన్నమాట!'

'మరే! వెధవ మగాళ్ళ- ఆడవాళ్ళని కాల్చుకు తింటుంటే సావిత్రులు, అనసూయలు భరించక ఏంచేస్తారూ?' అన్నది చెల్లెలు అక్క భుజం తడుతూ—

'వెధవ మొగుణ్ణి తిరగబడికొట్టరామా! ఉద్యోగం చేస్తున్నావిడ కూడా ఇంత పిరికితనమా?' అనుకుంది రఘుచెల్లెలు.

'అయ్యో! అలాంటి పిల్ల ఈ ఇంటి కోడలైతే ఎంత అదృష్టమో' అని గొణిగింది బామ్మ—

రఘు స్నానంచేస్తూనే వున్నాడు!

వీధిలో కాకులు ఎప్పుడో ఎగిరి పోయాయి.

చెట్టుకింద చెత్తకుండీ పక్కనవున్న నల్లటి పదార్థాన్ని ఓ కుక్క లాగింది! అది నూనెగుడ్డ! చచ్చిన కాకి కాదు!